క్లుప్తంగా

ఆయుర్వేద అవగాహన ర్యాలీ



అశోకవర్ధన పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, విద్యార్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఏలూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో నగరంలో ఆయుర్వేద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సీనియర్ ఆయుర్వేద వైద్యాధికారి కె.లక్ష్మీ సుభద్ర మాట్లాడుతూ పూర్వకాలం నుంచి దేశంలో ఆయుర్వేద వైద్యానికి ప్రాముఖ్యత ఉందని, మన పరిసరాల్లో లభించే ఔషధ మొక్కల ద్వారా అనేక వ్యాధులను నయం చేసుకోవచ్చని వివరించారు. తొలుత స్థానిక అశోకవర్ధన మున్సిపల్ పాఠశాల నుంచి ఆ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యశాల కాంపౌండర్ పి.లక్ష్మి, యోగా ఇన్‌స్ట్రక్టర్ సీహెచ్ రేణుక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు గిరిజన ఉద్యోగుల సంఘం సమావేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఏలూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 11న ఉదయం స్థానిక కొత్తబస్టాండు వద్ద ఉన్న ఎస్‌టీయూ భవన్‌లో నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాము ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కార్యవర్గ విస్తరణ, నియోజకవర్గ స్థాయిలో కార్యవర్గాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, సమస్యలను చర్చిస్తామని పేర్కొన్నారు. ఎస్టీ కమ్యూనిటీలో బోయ వాల్మీకులను కలపవద్దని రాష్ట్రపతికి పోస్ట్‌కార్డ్ ద్వారా తెలిపేందుకు తీర్మానిస్తామని తెలిపారు.

నేడు అక్షరం ఆర్ట్స్ వార్షికోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అక్షరం ఆర్ట్స్ సంస్థ 26వ వార్షికోత్సవం ఈ నెల 11న నిర్వహించనున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు డి.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాల్‌లో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఉదయం 10 గంటలకు వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభమౌతాయని పేర్కొన్నారు. నగరానికి చెందిన నాట్యాచారిణి మేడరమెట్ల శిరీష శిష్యబృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తారని, అనంతరం తాను రచించిన వెలుగు పూలు ద్విశతక పుస్తకాన్ని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆవిష్కరిస్తారని తెలిపారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల అధ్యాపకురాలు కొలిపాక అరుణకు సాహితీ సుధ పురస్కారం అందజేస్తామని పేర్కొన్నారు.

సంక్షేమ రథసారథి సీఎం జగన్

- మేయర్ షేక్ నూర్జహాన్
- సచివాలయం–1 పరిధిలో రూ.29.65 కోట్ల సంక్షేమం

ఏలూరు టౌన్: సంక్షేమ రథ సారధి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 2024 సార్వత్రిక ఎన్నికల్లో మద్దతుగా నిలవాలని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ ప్రజలను కోరారు. ఏలూరు కబాడీగూడెం సచివాలయం–1, వెంకటాపురం–5 హనుమాన్‌నగర్ పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబుతో కలిసి వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సచివాలయాల్లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. పార్టీ టోపీలను ధరించి క్యాడర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటినుంచీ ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నారని తెలిపారు. నాలుగున్నరేళ్ళ కాలంలో ఎన్నికల మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఏపీలో సంక్షేమ పథకాలు వెల్లువలా కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నికల్లో హామీలను నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు కష్టం తెలియకుండా సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. గత టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో చెప్పుకునే సత్తా లేదని అన్నారు. కనీసం చంద్రబాబు చేసిన ఒక్క మంచిపని చెప్పగలరా అని ప్రశ్నించారు. ఎన్నికలకు నాలుగు నెలల ముందు మాత్రమే ప్రజలను మభ్య పెట్టేందుకు పింఛన్, మహిళలకు పసుపు కుంకుమ అంటూ మోసం చేశారని గుర్తు చేశారు. మరోసారి చంద్రబాబు మోసాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని వివరించారు. కబాడీగూడెం సచివాలయం పరిధిలో సీఎం వైఎస్ జగనన్న ప్రభుత్వం ద్వారా ప్రజలకు అమ్మఒడి, విద్యాదీవెన, డ్వాక్రా రుణమాఫీ, ఆసరా, చేయూత, పెన్షన్లు, జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇలా ప్రతి సంక్షేమ పథకాన్నీ అవినీతికి తావులేకుండా అందజేశారని మేయర్ నూర్జహాన్ తెలిపారు. ఈ సచివాలయం పరిధిలో సుమారు 4884మంది ప్రజలకు రూ.29.65 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు తుమరాడ స్రవంతి, యర్రంశెట్టి నాగబాబు, దేవరకొండ శ్రీనివాస్, సబ్బన శ్రీనివాస్, పార్టీ నాయకులు కిలాడి దుర్గారావు, నున్న కిషోర్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, గుడిదేశి లక్ష్మీశారద, తదితరులు ఉన్నారు.



పార్టీ జెండా ఆవిష్కరించి, దివంగత వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న మేయర్ నూర్జహాన్



11వ డివిజన్‌లోని పార్టీ జెండా ఆవిష్కరణలో పాల్గొన్న కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, పార్టీ నేతలు



డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన నాయకులు

పేదల పక్షపాతి జగన్

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని 11వ డివిజన్ సచివాలయం–47లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. క్లస్టర్–1 పార్టీ మహిళా అధ్యక్షురాలు, కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి, 11వ డివిజన్ ఇన్‌చార్జి కోయ సత్తిబాబు పార్టీ జండాను ఆవిష్కరించారు. జేసీఎస్ క్లస్టర్–1 కన్వీనర్ మోటమర్రి సదానందం, నాయకులు సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏమి చేశారో చూశామని, 2014లో చంద్రబాబు ప్రజలకు ఏమి చేశారో ప్రజలు గుర్తు పెట్టుకున్నారని వివరించారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు మేలు చేసిందేమీ లేదన్నారు. ప్రతి రోజూ చంద్రబాబు, టీడీపీ నేతలు, పవన్‌కళ్యాణ్ వంటి నాయకులు సీఎం జగనన్నను విమర్శించేందుకే సమయం కేటాయిస్తున్నారే తప్ప, ప్రజలకు ఏమి చేయాలో వారికి ఆలోచన లేదని ఆరోపించారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, కానీ ప్రజలు చంద్రబాబు నీచమైన కుట్రలను తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్–1 యూత్ ప్రెసిడెంట్ జిజ్జువరపు రమేష్, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎస్‌వీ శివరావు, టీఎల్ఎఫ్ వన్‌టౌన్ అధ్యక్షులు సూర్యకుమారి, పార్టీ నాయకులు అలా గణేష్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, ప్రజలు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలు సాధించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని వాటిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు అన్నారు. డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులను స్వాగతిస్తూ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడరు. ఉన్నత స్థానాలకు చేరుకున్న కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, తమ జూనియర్లకు మార్గదర్శకంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ గిరిబాబును ప్రశంసించారు. గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నతానియేల్ మాట్లాడుతూ అకాడమిక్ విషయాలతో పాటు ఆరోగ్యానికి ఆనందానికి ఆటల్లోనూ పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలా కుమారి మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ఆటల పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్ వివిధ విభాగాల అధ్యాపకులు వి.వెంకటరావు, సీహెచ్ ఉదయలక్ష్మి, ఎం విజయకుమార్, ఎస్ పరమేశ, ఎం రాంబాబు, ఎం కృష్ణ చైతన్య, పీఆర్ కావ్య శ్రీ, టి.వెంకట దుర్గాప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనతో ఫ్రెషర్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

మహిళా సమస్యలపై పోరాడిన విజయలక్ష్మి

ఏలూరు (టూటౌన్): జిల్లాలో మహిళల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన నేత గొట్టిపాటి విజయలక్ష్మి అని ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి అన్నారు. స్థానిక ఐద్వా జిల్లా ఆఫీసులో ఐద్వా జిల్లా పూర్వపు కార్యదర్శి విజయలక్ష్మి వర్ధంతి సభ కె.విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. హైమావతి మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఐద్వా జిల్లా కార్యదర్శిగా జి.విజయలక్ష్మి పనిచేశారని గుర్తు చేశారు. జిల్లాలో మహిళలపై జరిగిన దాడులు, అత్యాచారాలు పై ఆందోళనలు చేశారన్నారు. ఇబ్బందుల్లో ఉన్న మహిళల కోసం ఏలూరులో ఐద్వా ఆఫీసులోనే లాయర్లతో ఉచిత మహిళా న్యాయ సహాయ కేంద్రం నడిపారని గుర్తు చేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కంప్యూటర్ శిక్షణా కేంద్రం నిర్వాహకురాలు లక్ష్మి, చందన, జాహ్నవి, సీఐటీయూ నాయకులు పి.కిషోర్, పి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగన్ ఘనతే

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శుక్రవారం ఏలూరు మండలం శ్రీపర్రు పంచాయతీ శివారు గ్రామం మానూరు, మహేశ్వరపురంలో ఆయన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్ నేతృత్వంలో ఎమ్మెల్యేకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాల పేదలు ఆర్థికంగా బలోపేతమయ్యారన్నారు. అనంతరం ఆయన ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులను కలిసి వారికి అందుతోన్న పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు నిరాఘటంగా అమలు చేయడంపై పలువురు మహిళలు ఎమ్మెల్యే వద్ద సంతోషం వ్యక్తం చేశారు. పథకాల వల్ల తమ కుటుంబాలకు జరిగిన మేలును వివరించారు. స్థానిక సమస్యలు వివరించగా పరిష్కరించాలని ఎంపీడీఓ బి ప్రణవి, కార్యదర్శి లావణ్యను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, వడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ మండల కొండలరావు, సైదు వజ్రంతో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మానూరులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

‘ప్రయాణికుల సూచనలను పరిశీలిస్తాం’



సమస్యలు వింటున్న ఆర్టీసీ డీఎం వాణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ప్రయాణికుల సూచనలను పరిశీలిస్తామని ఏలూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బి.వాణి పేర్కొన్నారు. ఏలూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఆమె డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. చింతలపూడి నుంచి ఏలూరు మీదుగా విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్ నడపాలని, గుండుగొలను కొత్త వంతెన వద్ద అన్ని బస్సులను ఆపాలని ప్రయాణికులు కోరారు. అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను భీమడోలు బస్టాండులోకి ప్రవేశించేలా ఏర్పాటు చేయాలని, భీమడోలు బస్టాండులో ఉన్న కార్గో పాయింట్ సిబ్బంది పనితీరు బాగోలేదని ఫిర్యాదు చేశారు. కొవ్వూరు, ద్వారకాతిరుమల, ఏలూరు వైపు వెళ్లే బస్సులు బైపాస్ మీదుగా కాక గుండుగొలను వంతెన మీదుగా తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్ని ఆర్టీసీ బస్సులు రోడ్డు పక్కన ఉండే ధాబాల వద్ద అల్పాహారానికి ఆపుతున్నారని, ఆయా ధాబాల్లో ధరలు సాధారణ ప్రయాణికులకు భారంగా ఉంటున్నాయని, ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్ బస్సుల్లో సీట్లు శుభ్రంగా ఉండడం లేదని, కార్గో ద్వారా సైకిళ్ల రవాణాకు భారీ ఛార్జీలు వసూలు చేస్తున్నారని, చింతలపూడి నుంచి రాత్రి 6.30 గంటల తరువాత ఏలూరు వైపుకు బస్సులు తిప్పాలని, విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ఏలూరు వరకు నాన్‌స్టాప్ బస్సులు నడపాలని కోరారు.

వ్యక్తి బలవన్మరణం

ఏలూరు టౌన్: చెడు వ్యసనాలకు బానిసగా మారిన వ్యక్తి అప్పులు తీర్చే దారిలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. కామవరపుకోట మండలం వీరంపాలెం గ్రామానికి చెందిన కుంచే రాము (35)కు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్యాభర్తలు కలిసి ఒక కోళ్ల ఫారమ్ వద్ద పనిచేస్తున్నారు. పేకాటలు, క్రికెట్ బెట్టింగులకు బానిస అయిన రాము అనేక అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య పిల్లలను తీసుకుని తన పుట్టింటికి వెళ్లిపోయింది. భార్యతో గొడవలు, చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవటంతో రాము శుక్రవారం సాయంత్రం తన ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అతడ్ని ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా ఆసుపత్రి అత్యవసర విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔటోపోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
డి.తిరుమల ఏలురు బీహెచ్‌ఈఎల్	22.15	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	31
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	19
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	22
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు –తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	34	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	38
వంకాయలు (తెలుపు)	24	ములక్కాడలు	7–10
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	40
కాకర కాయలు	24–28	కీరా దోస	42
బీరకాయలు	26	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	34	అల్లం	130
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	16	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	45–55	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	06
దోసకాయలు	16	పుదీనా	05
ఆనపకాయ (1)	15– 20	క్యాప్సికమ్	--
పొట్లకాయ(1)	15– 20	చిలకడదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



ఇంటి యజమానులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామని, అనేక అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు నగరంలోని ఆర్ఆర్‌పేట, యాదవనగర్, తంగెళ్లమూడి శివగోపాలపురం, లంకపేట ప్రాంతాల్లో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అడిగి తెలుసుకోవటంతోపాటు, వాటి పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. క్లాప్ యూజర్ చార్జీల వసూలు, ఆస్తి పన్నులు, కుళాయి పన్నులు, పన్నుల బకాయిలపై ఆరా తీశారు. నగర డిప్యూటీ కమిషనర్ రాధా, నోడల్ ఆఫీసర్లు, సచివాలయ ఉద్యోగులుతో కలిసి ఇంటింటికీ వెళ్లి పన్ను బకాయిల వివరాలు తెలియజేసి, వాటిని త్వరితగతిన చెల్లించాలని కోరారు. ఇంటింటా చెత్త సేకరణ అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నగర కమిషనర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నగరంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన వివిధ పన్నులను సకాలంలో చెల్లించటం ద్వారా అభివృద్ధికి సహకరించాలని సూచించారు. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు అందించిన సమాచారం మేరకు బకాయిలను త్వరగా చెల్లించాలని ప్రజలను కోరారు.

దీపావళి బోనస్ ఇవ్వాలంటూ ధర్నా

ఏలూరు (టూటౌన్): దీపావళి బోనస్ ఇవ్వాలని కోరుతూ శ్రీ కృష్ణ ఏషియన్ జూట్ మిల్లు కొత్తూరు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసు వద్ద శుక్రవారం కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్షుడు బి.జగన్నాధం, ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబ మాట్లాడారు. ఏటా దీపావళి పండుగకు ముందు బోనస్ యాజమాన్యం ఇచ్చేదని, ఈ సారి నోటీస్ బోర్డు ద్వారా బోనస్ ఇవ్వలేమంటూ తెలియజేసిందని చెప్పారు. ఇది సరికాదని, కార్మికులను భయభ్రాంతులకు గురి చేసే విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని నాయకులు పిలుపు నిచ్చారు. దీనిపై కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని దీనిపై జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాని విజ్ఞప్తి చేశారు. కొత్తూరు జూట్ మిల్లు డైరెక్టర్‌గా ఉన్న శంకర్ గోపాలునాని కార్మికుల వద్దకొచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నెలరోజుల్లో బోనస్ వచ్చే విధంగా యాజమాన్యంతో మాట్లాడి తగు ఏర్పాటు చేస్తామని మిల్లు పర్సనల్ మేనేజర్ సురేష్ ఇచ్చిన హామీతో కార్మికులు ధర్నాను విరమించారు. ధర్నాలో తిరుపతి స్వామి, అప్పారావు, వెంకటేశ్వరరావు, గూడూరి నాగేశ్వరరావు, శంకర్ నాయుడు పాల్గొన్నారు.



కొత్తూర జూట్ మిల్లు మేనేజర్ సురేష్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కలెక్టర్ దృష్టికి ముంపు మండలాల సమస్య

కుక్కునూరు: పోలవరం నియోజకవర్గంలోని ముంపు మండలాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కుక్కునూరు నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులు చేయించాలని కోరారు. ఆర్ఆర్ నిర్వాసితుల స్ట్రక్చర్ వాల్యూ సమస్యలను పరిష్కరించాలని, ఎమ్మెల్యే బాలరాజు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ని కోరారు. సమస్యలను పరిష్కరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని నాయకులు చెప్పారు. కలెక్టర్‌ని కలిసిన వారిలో నాయకులు రావు వినోద్, మాధిరాజు వెంకన్నబాబు, జక్కం నాగేశ్వరరావు పలువురు ఉన్నారు.

సీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

పోలవరం రూరల్: పోలరవం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని నవభారత్ మిషన్ నిధులు రూ.16 లక్షలతో ఆధునీకరించారు. ఈ సీహెచ్‌సీలో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్‌ను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రేణుక మాట్లాడుతూ త్వరలో ఇక్కడ ఆపరేషన్లు నిర్వహిస్తామని చెప్పారు. సర్పంచ్ పి.పుష్ప, జెడ్పీటీసీ కె.హేమకుమారి, పార్టీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.